

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 16-08-2025 సంపుటి : 07 సంచిక : 98 పేజీలు : 8 వెల : రూ 3-00


# రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే ఏకైక లక్ష్యం







**ఎపికి పెట్టుబడుల వెల్లువ**
**గుడ్ గవర్నెన్స్‌తో పట్టాలపైకెక్కిస్తున్నాం**
**గత ప్రభుత్వం ఎపి బ్రాండ్‌ను నాశనం చేసింది**
**పదిలక్షల కోట్ల అప్పులతో ఎపిని దివాళా తీయించింది**
**రూ.10 వేల కోట్లతో తల్లికి వందనం' తీసుకొచ్చాం.**
**47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు- అందించాం**
**40 వేల సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్**
**గిరిజన గూడాలకు వేయికోట్లతో రోడ్ల అభివృద్ది**
**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు**

విజయవాడ,ఆగస్ట్15: గత వైకాపా ప్రభుత్వం ఏపీ బ్రాండ్‌ను నాశనం చేసింది. వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయింది. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలతో ఆర్థిక విధ్వంసం చేశారు. ఆ ఐదేళ్లు ఎక్కడా అభివృద్ధి జరగలేదని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేదు. తవ్వినకొద్దీ గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు, అక్రమాలు, అవకతవకలు వెలుగుచూస్తున్నాయి. పోలవరం నిలిచిపోయింది. అవరావతి ఆగిపోయింది. పెట్టుబడులు తరలిపోయాయని అన్నారు. విజయువాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయజెండాను ఆవిష్కరించారు.పోలీసుల గౌరవ వందనం స్వకీరించారు. అనంతరం మాట్లాడుతూ... 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌కు మొదటి ముఖ్యమంత్రిగా ప్రజలు తనకు అవకాశం కల్పించారని చంద్రబాబు తెలిపారు. అనుభవం, ప్రజల సహకారంతో కష్టపడి దేశంలో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీని నిలిపామన్నారు. 019లో వచ్చిన ప్రభుత్వం 5 సంవత్సరాల పాటు- రాష్ట్రాన్ని విధ్వంసం చేసింది. 2024 ఎన్నికల్లో ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలవాలి అనే ఎన్డీయే నినాదాన్ని ప్రజలు నమ్మి చరిత్రాత్మక తీర్పునిచ్చారు. నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించారు. 94 శాతం ÷-స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో కూటమిని దీవించారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే ఏకైక లక్ష్యంతో పాలన ప్రారంభించాం. మేం అధికారాన్ని చేపట్టిన ఏడాదిలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా, భవిష్యత్తుకు బాటలు వేసేలా పని చేశాం. తొలి సంతకం నుంచి సుపరిపాలన వైపు అడుగు వేశాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో సాగిన ఏడాది పాలన ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ప్రజల మద్దతు, మా సంకల్పం, దేవుడి దయతో విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం చేస్తున్నాం. నేను ఈరోజు సవినయంగా, సగర్వంగా చెబుతున్నా కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి సాటి లేదు.. అభివృద్ధికి అడ్డు లేదు.. సుపరిపాలనకు పోటీలేదు. ఇది రికార్డు.. ఇదే ఆల్-టైమ్ రికార్డు అని మరోసారి చెబుతున్నా. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం. బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం అని అన్నారు. పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించాం. ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేసి సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థం ఇచ్చాం. పేదింటి తల్లులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు 'తల్లికి వందనం' తీసుకొచ్చాం. రూ.10 వేల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశాం. దీని ద్వారా 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు- అందించాం. దీపం పథకం కింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటివరకు 2 కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చాం. ఆడబిడ్డలకు 'స్త్రీశక్తి' పేరుతో ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెడుతున్నాం. మెగా డీఎస్సీ నియామకాలను ఈ నెలాఖరుకు పూర్తిచేస్తాం. ప్రజలకు నాదు కునుకు లేకుండా చేసిన ల్యాండ్ -టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీ-న్లు తిరిగి తెరిచాం. 204 అన్న క్యాంటీ-న్లలో 5.16 కోట్ల మందికి రూ.5కే కడుపు నింపుతున్నాం. ఆలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలకు పెంచాం. 40 వేల సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. కల్లు గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు, బార్‌లు కేటాయించాం. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఈ పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు- అందించాం. చేనేతకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.

# సూపర్ సిక్స్ ..సూపర్ హిట్

**హామీలన్నీ అమలు చేస్తున్నాం**
**అడబిడ్డల గౌరవం పెంచేలా చర్యలు**
**ఉచిత బస్సుతో మహిళలు ఎక్కడైనా ప్రయాణించే వీలు**
**స్త్రీశక్తి పథకానికి జెండా ఊపిన సిఎం చంద్రబాబు**

విజయవాడ,ఆగస్ట్15 : 'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా ఏపీలో కూటమి ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చింది. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో 'స్త్రీశక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. విజయవాడలో స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించే ముందు మాట్లాడారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్రమే తమ లక్ష్యమన్నారు. ఆడబిడ్డల గౌరవం పెంచేందుకు ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు మంచి చేశామనే తృప్తి కలుగుతోందన్నారు. రాష్ట్రమంతా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. ఈ పథకం ద్వారా 2.64 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత కాలం దూసుకెళ్తామన్నారు. ఈరోజు గర్వంగా చెబుతున్నా సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. వైకాపా పాలనలో ప్రజలు ఐదేళ్ల పాటు- నవ్వడమే మరిచిపోయారు. ఇంటా, బయట ప్రజలకు ఆనందం లేకుండా పోయింది. ఆడ బిడ్డలకు మహర్దశ వచ్చే వరకు అండగా ఉంటాం అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు స్త్రీ శక్తి పథకానికి శ్రీకారం చుట్టాం. మహిళలకు మేలు చేస్తున్నామన్న తృప్తి కలుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాం. మహిళా సాధికారిత కోసమే డ్వాక్రా, మెప్మా సంఘాలు ఏర్పాటు- చేశాం. ఆర్టీసీ కండక్టర్లుగా తొలుత మహిళలను తీసుకున్నది మేమే. మహిళలు త్వరలో ఆర్టీసీ డ్రైవర్లుగా కూడా రావాలని కోరుకుంటున్నామని అన్నారు.











# రక్షణ విషయంలో కేంద్రం కీలక నిర్ణయం

**మిషన్ సుదర్శన్ చక్రను ప్రకటన**
**ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌ను దెబ్బతీసాం**
**యువతకు పిఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన**
**దీపావళి నుంచి జిఎస్టీ సవరణలు అమలు**
**ఎర్రకోటపై జెండా ఆవిష్కరించి..ప్రసంగించిన ప్రధాని మోడీ**







న్యూఢిల్లీ,ఆగస్ట్15: రక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకొంది. భారత్‌ను ఎలాంటి ముప్పు నుంచైనా రక్షించేందుకు వీలుగా మిషన్ సుదర్శన్ చక్రను ప్రధాని మోదీ ప్రకటించారు. వచ్చే పదేళ్లలో దేశీయ సాంకేతికతతో అభివృద్ధి చేయనున్న ఈ వ్యవస్థ కీలక ప్రదేశాలను కాపాడనుంది. 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని..ఇటీవలి ఆపరేషన్ సిందూర్, జిఎస్టీ, యువత కోసం కొత్త పథకం వంటి అనేక విషయాలను ప్రస్తావించారు. ఇది 140 కోట్ల మంది సంకల్ప పండగ అని, 75 ఏళ్లుగా రాజ్యాంగం మనకు మార్గదర్శనం చేస్తోందని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. దేశ 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ... శుక్రవారం ప్రధాని మోడి న్యూఢిల్లీలో ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. దీనికి ముందుగా త్రివిధ దళాల నుంచి ప్రధాని గౌరవ వందనం స్వీకరించారు. రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించారు. జెండా ఆవిష్కరణ అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ .... ఇది సమైక్య భావనతో దేశం ఉప్పొంగే సమయం అని అన్నారు. కోట్ల మంది త్యాగాలతో మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. 75 ఏళ్లుగా రాజ్యాంగం మనకు మార్గదర్శనం చేస్తోందని, రాజ్యాంగ నిర్మాతల సేవలు మరువలేనివి అని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన వీరజవాన్లకు సెల్యూట్ చేస్తున్నామన్నారు.



# సంపాదకీయం

శనివారం 16-08-2025

## ప్రకృతి ప్రకోపానికి బలవ్వాల్సిందేనా!

క్లౌడ్ బరస్ట్ ..ఈ మధ్య కొత్తగా వింటున్నదేమీ కాదు. క్యుములో నింబస్ మేఘాలు ఉరుము ఉరిమినట్లుగా కురియడంతో ఒకేచోట కుండపోత వానగా వస్తోంది. ఉమ్మడి ఏపిలో ఈ క్యుములో నింబస్ మేఘాల వల్లనే అప్పటి సిఎం రాజశేర్ రెడ్డితో పాటు, అయన పరివారం మృత్యువాత పడింది. ఇదంతా కేవలం ప్రకృతి విధ్వంసం వల్ల జరుగుతున్న విపరిణామంగా చూడాలి. మనం నిత్యం కొండలను గుట్టలను కొట్టేస్తున్నాం. అడవులను నరికేస్తున్నాం. కాశ్మీర్ ,ఉత్తరాఖండ్, కేరళ, హిమాచల్, ఎపి, తెలంగాణ ఇలా రాష్ట్రం ఏదైనా ప్రకృతిని నాశనం చేయడం వల్లనే ఉత్పాతాలు జరుగుతున్నాయి. వాటినుంచి మనం గుణపాఠం నేర్చుకోవడం లేదు. అడ్డుకునే ప్రయత్నాలు చేయడం లేదు. ఈక్రమంలో తాజాగా జమ్మూకశ్మీర్ కొండల్లో ఆకస్మిక వరదల కారణంగా 60 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి గాయాల పాలయ్యారు. జమ్మూలో గురువారం మేఘ విస్ఫోటం విరుచుకుపడింది. ఫలితంగా మచైల్ మాతా దేవి దర్శనానికి వెళ్తున్న యాత్రికులు బలయ్యారు. ఒక్కసారిగా వచ్చి పడిన ఆకస్మిక వరదతో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. చాలామంది గల్లంతయ్యారు. పలు భవనాలు, దుకాణాలు తుడిచిపెట్టుకుపోయాయి. వరదల కారణంగా తీవ్ర విషాదం నెలకొనడంతో మచైల్ మాతా దేవి యాత్రను నిలిపివేశారు. ఇకపోతే ఉత్తరాఖండ్‌లో ఖీర్‌గంగా నది మెరుపు వరదతో ధరాలీ పట్టణంపై విరుచుకుపడిన తీరును కూడా చూశాం. ఎగువ ప్రాంతాల్లో జరిగిన క్లౌడ్ బరస్ట్ కారణంగా అనూహ్య స్థాయిలో భారీ వరద చోటుచేసుకుంది. వరద ధాటికి ధరాలీ పట్టణంలోని దాదాపు సగభాగం కొట్టుకుపోయింది. కొన్ని అడుగుల మేర పేరుకుపోయిన బురద తప్ప అక్కడ ఉన్నట్టి ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు వంటివి ఏవీ ప్రస్తుతం కనిపించడం లేదు. వరద ధాటికి మూడు నాలుగు అంతస్తుల భవనాలు పేకమేడల్లా కూలిపోయాయని, యాత్రికుల కోసం నిర్మించిన 20–25 హోటళ్లు, పలు హోం స్టేలు ప్రస్తుతం కనపడటం లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అధికారిక సమాచారం ప్రకారం 40 నుండి 50 ఇళ్లు కొట్టుకుపోయాయి. ఐదుగురు మరణించారు. ఉత్పాతం చోటు–చేసుకున్న సమయంలో పర్యాటకులు ఎవరైనా ధరాలీలో ఉన్నారా ఉంటే వారి పరిస్థితి ఏమిటి? అన్న దానితో పాటు–, స్థానికులందరూ క్షేమంగా ఉన్నారా అన్న అంశంపై కూడా స్పష్టత రావడం లేదు. దుర్ఘటన జరిగిన వెంటనే సమీపంలోని హర్సిల్‌లో ఉన్న సైనిక బృందాలు అక్కడికి చేరుకున్నాయి. ఆ సైనిక క్యాంపునకు చెందిన వారే 10 మంది వరద ధాటికి గల్లంతు కావడం గమనార్హం. మిగిలిన సైన్యం తమ శక్తి మేరకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. క్లౌడ్ బరస్ట్ కారణంగా రహదారులు ధ్వంసం కావడం, నిరవధికంగా కురుస్తున్న వర్షంతో హెలికాప్టర్ ప్రయాణానికి వాతావరణం అనుకూలించకపోవడం వంటి పరిస్థితులు దాపురిస్తున్నాయి. దుర్ఘటన జరిగిన తరువాత కూడా ఆ ప్రాంతంలో అధిక వర్షపాతం కురవడం కానీ, క్లౌడ్ బరస్ట్ వంటి ఉత్పాతాలు చోటు చేసుకోవడం చూస్తున్నాం. ఖీర్‌గంగ ఇలా ఉప్పొంగడం ఇదే మొదటిసారి కాదు. ఇటీవల కాలంలో 2018లో, 2021లో కూడా ఈ నదికి భారీగా వరదలు వచ్చి, తీవ్ర నష్టం వాటిల్లింది. 1835లో అతి పెద్ద వరద ఈ నదికి వచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పటి మాదిరే బురద వరద అప్పుడు కూడా ధరాలీని ముంచెత్తిందని, దాంతో అప్పటి పట్టణం పూర్తిగా ధ్వంసం అయిందని చెబుతున్నారు. ఆ శిథిలాలపైన ప్రస్తుత పట్టణం నిర్మాణ మైంది. ధరాలీకి ఎగువన ఖీర్ గంగా ప్రవాహాన్ని ఆనుకుని పెద్ద గడ్డిమైదానాలు, కొండలు, పాతకాలపు హిమాని నది శిథిలాలు ఉండటంతో వరదలు వచ్చిన ప్రతిసారీ బురద వెల్లువెత్తుతోందని జిల్లా అధికార యంత్రాంగం నిర్ధారించింది. మరోవైపు అభివృద్ధి పేరుతో పెద్దఎత్తున సాగుతున్న అడవుల విధ్వంసం కూడా ఉత్తరాఖండ్‌లో కొనసాగుతోంది. ఒక్క గత సంవత్సరంలోనే 998 హెక్టార్లలోని అటవీ ప్రాంతం నష్టపోయినట్లు అధికారిక నివేది వెల్లడించింది. 2021–24 మధ్య అటవీ ప్రాంతాల్లో 41 శాతం చెట్లను కోల్పోయినట్లు తాజాగా విడుదలైన ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. విచ్చలవిడిగా సాగుతున్న ఈ తరహా విధ్వంసం కూడా ప్రకృతి ప్రళయాలకు కారణమౌతోంది. అదే విధంగా ఖీర్‌గంగా పొడవునా రక్షిత గోడ నిర్మించాలని స్థానిక ప్రజలు కొన్ని సంవత్స రాలుగా కోరుతున్నారు. అధికార యంత్రాంగం ఈ విషయాలపై దృష్టి సారిస్తే స్థానిక ప్రజలకు కొంత మేర ఊరట లభిస్తుంది. ఉమ్మడి ఎపిలోనూ వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వర్షం నీరు వస్తే పోయే దారులను ఆక్రమించి ఇళు కట్టుకుంటున్నాం. దీంతో ఆకస్మిక వరదలు వస్తున్నాయి. మొన్నటికి మొన్న వరంగల్‌లో మరోమారు వర్షబీభత్సం సృష్టిం చింది. ఖమ్మంలో జోరుగా వర్షాలు పడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో రోడ్లు చెరువులను తలపి స్తున్నాయి. చెరువులను మాయం చేసిన పాపానికి ఇలా తయ్యారయ్యింది. ఇకపోతే మూసీ ఆక్రమణల కారణంగా హైదరాబాద్‌లో మూసీ ఉధృతంగా ప్రవహించింది. పురానాపూల్ శ్మశాన వాటిక మునిగి పోయింది. గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ఉమ్మడి ఎపిలో పలు ప్రాంతాలు మళ్లీ వరదలకు గురవుతున్నాయి. వివిధ జిల్లాల్లో చిన్నా పెద్దా జలపాతాలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పుడు మనం చూస్తున్న వరదలు, వానలు సకాలంలో కురవక పోవడం, క్లౌడ్ బరస్ట్‌లు అన్నీ కూడా ప్రకృతి విధ్వంసానికి నిదర్శనాలు.

## కులాల వివక్ష, అసమానతలు ఇంకా కొనసాగడం బాధాకరం : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ : స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడుస్తున్న ఇంకా దేశంలో కులాల వివక్ష అసమానతు కొనసాగడం బాధాకరమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురువేసి మాట్లాడారు. ఎంతో మంది మహనీయుల త్యాగాలతో స్వాతంత్రము వచ్చిందని, ఆర్థికంగా, సామాజికంగా అందరు అభివృద్ధి చెందాలని వారు కోరుకున్నారని అయితే ఇంకా అత్యాచారాలు, వరకట్న వేధింపులు, కులాల వివక్ష, అసమానతలు కనిపిస్తుండడం బాధ కలుగుతుందని పేర్కొన్నారు. వీటిని రూపుమాపాల్సిన అవసరం ఉందని అన్నారు. మనకంటే చిన్న చిన్న దేశాలు ఆర్థికంగా అభివృద్ధి అవుతున్నాయి. దేశం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెల్లడించారు. స్వదేశీ వస్తువులను వాడాలి. ఇతర దేశాల నుంచి వచ్చిన వస్తువుల కొనుగోలు తగ్గించాలని సూచించారు. భారత దేశంపై ఆధారపడి చాలా దేశాలు ఉన్నాయని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాష్టాన్ని అన్ని రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లిందని గుర్తు చేశారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ ఇచ్చినట్టే స్థానిక సంస్థల్లో కూడా వారికీ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న ,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గిరిధర్ రెడ్డి గణేష్, అనంత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసులు, నవకాంత్, రామలక్ష్మణ్, అన్వార్ పాష, నరేందర్, మోసిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## వరద ఉధృతికి 65కు చేరిన మృతుల సంఖ్య.. శిథిలాల కింద ఇంకెందరో..!

జమ్ముకశ్మీర్‌లోని కిష్త్వర్‌లో బీభత్సం సృష్టించిన వర్షం భారీగా ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. వరద ఉధృతికి వందలాది మంది కొట్టుకుపోగా పలు ఇండ్లు నేలమట్టం అయ్యాయి. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఆ రాష్ట్ర మంత్రి జావేద్ దార్ మృతుల సంఖ్య 60 దాటిందని వెల్లడించారు. రెండు రోజుల క్రితం మచైలీ మాతా యాత్ర మార్గంలో సంభవించిన 'ఫ్లాష్ ఫ్లడ్స్' కారణంగా శుక్రవారం 65 మంది మరణించారని తెలిపారు. అయితే.. శిథిలాల కింద మరికొంతమంది మృతదేహాలు లభ్యమయ్యే అవకాశం ఉందని ఎన్డీఆర్ఎఫ్ దళాలు భావిస్తున్నాయి. గల్లంతైన వారి ఆచూకీ గురువారం రాత్రి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకూ తీవ్రగాయాలతో బాధపడుతున్న167 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి ఈ బృందాలు. 'క్లౌడ్ బరస్ట్' కారణంగా ఊహించని ఉప్పెనను ఎదుర్కొంటున్న జమ్ము కశ్మీర్‌కు కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం చేస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, గవర్నర్ మనోజ్ సిన్హాతో మాట్లాడిన మోడీ పరిస్థితిని ఆరా తీశారు. సీఎం అబ్దుల్లా మాట్లాడుతూ.. తాను వరద తీవ్రతకు దెబ్బతిన్న కిష్త్వర్‌లోని చొసిటి ప్రాంతానికి వెళ్లి.. అక్కడ సహాయ చర్యలను పరిశీలిస్తానని వెల్లడించారు. భారీగా నష్టపోయిన అక్కడి ప్రజలకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేసేలా చూస్తానని ఒమర్ అబ్దుల్లా తెలిపారు.



## ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు

### ప్రమాదంలో పదిమంది దుర్మరణం

కోల్‌కతా,ఆగస్ట్15 స్వాతంత్య్ర దినోత్సవం రోజున విషాద ఘటన చోటు–చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా బర్ధమాన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక జాతీయ రహదారి 19లోని నాలా ఫెర్రీ ఘాట్ వద్ద ఈ ఘటన చోటు– చేసుకుంది. శుక్రవారం వేకువజాము బర్ధమాన్ నుంచి దుర్గాపూర్ వెళ్తున్న ప్రైవేట్ ప్యాసింజర్ బస్సు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు మృతి చెందగా.. 35 మందికి గాయాలయ్యాయి. ప్రయాణికులంతా బిహార్ వాసులని తెలిసింది. వీరంతా గంగా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి తిరిగి వెళ్తున్నారు. ఈ ప్రమాద సమయంలో మొత్తం 45 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారు. చనిపోయిన వారిలో ఎనిమిది మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. అలాగే గాయపడ్డ వారిలో ఆరుగురు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు.. సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోనూ ఇవా(శుక్రవారం) ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ట్రక్కును కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాగ్నాడి పోలీస్ స్టేషన్ పరిధి చిర్చారి గ్రామం సమీపంలో ఈ ఘటన చోటు– చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 25 నుంచి 34 ఏళ్ల మధ్య వయస్సు గల ఏడుగురు స్నేహితులు.. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి అంతర్రాష్ట్ర పర్యటనకు బయలుదేరారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత.. ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశాలోని పూరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. డ్రైవర్ నిద్రలోకి జారుకోగానే వాహనం డివైడర్‌ను దూకి ఎదురుగా ఉన్న లేన్‌లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. దీంతో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు.

## 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



అశ్వారావుపేట టౌన్, ఆగస్ట్ 15:నేటి యువతరం నైతిక విలువలు శ్రమ సాంకేతికతతో దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపు. అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, శుక్రవారం అధికారులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి అశ్వారావుపేట ప్రభుత్వ క్యాంపు కార్యాలయం, రింగ్ రోడ్డు సెంటర్, ప్రెస్ క్లబ్ నందు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్యం అనేక త్యాగాల ఫలితమన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కలల భారత నిర్మాణం కోసం ప్రతీ పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. యువతరం నైతిక విలువలు శ్రమ సాంకేతికతతో దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు అన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా 79 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 15–నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మెదటగా పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి అనంతరం జాతీయజెండాను జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ స్వాతంత్ర్యం సాధించడం కోసం వారు పడిన శ్రమలను మరియు అర్పించిన ప్రాణ త్యాగాలను గురించి వివరించారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని దేశభక్తిని భావితరాలకు అందించే దిశగా సమిష్టిగా కృషి చేయాలని తెలియజేశారు. పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి సేవ పతకాలు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం.జావళి ,అడిషనల్ ఎస్పీ ఎన్ .యుగంధర్ బాబు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పోలీసు కార్యాలయ సిబ్బంది టౌన్ అదికారులు పాల్గొన్నారు.




## దేశభక్తిని భావితరాలకు అందించే దిశగా సమిష్టిగా కృషి చేయాలి

**---దేరెడ్డి శివనాగిరెడ్డి 38 వ వార్డు టిడిపి ఇంచార్జ్**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 15– దేశభక్తిని భావితరాలకు అందించే దిశగా సమిష్టిగా కృషి చేయాలని 38 వ వార్డు టిడిపి ఇంచార్జ్ దేరెడ్డి శివ నాగిరెడ్డి పేర్కొన్నారు. పరివర్తన లైఫ్ సెంటర్ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ స్వాతంత్ర్యం సాధించడం కోసం వారు పడిన శ్రమలను మరియు అర్పించిన ప్రాణ త్యాగాలను గురించి వివరించారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని దేశభక్తిని భావితరాలకు అందించే దిశగా సమిష్టిగా కృషి చేయాలని తెలియజేశారు. అనంతరం నందమూరి నగర్ జిల్లా పరిషత్ హై స్కూల్ నందు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జా దశరథరామిరెడ్డి. ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి. స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## నాగాలాండ్ గవర్నర్ గణేశన్ మృతి

చెన్నై,ఆగస్ట్15(: నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ కన్నుమూశారు. శుక్రవారం చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తన 80వ ఏట మృతి చెందారు. ఇటీవలే ఆగస్టు 8న చెన్నైలోని తన ఇంట్లో కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. గణేషన్ తమిళనాడు బీజేపీకి చెందిన సీనియర్ నేత. ఆర్ఎస్ఎస్ నేపథ్యం కూడా ఉంది ఆయనకు. 2023 ఫిబ్రవరి 19 నుంచి నాగాలాండ్ గవర్నర్ గా పనిచేస్తున్నారు. నాగాలాండ్ కు పనిచేసిన వారిలో ఆయన 19వ గవర్నర్. అంతకు ముందు ఆయన మణిపూర్ కు 17వ గవర్నర్ గా కూడా పనిచేశారు. 2021 ఆగస్టు 27 నుంచి 2023 ఆగస్టు 19 మధ్య కాలంలో మణిపూర్ గవర్నర్ గా పనిచేశారు. అదే విధంగా 2022 జులై 18 నుంచి 2022 నంబర్ 17 మధ్య కాలంలో వెస్ట్ బెంగాల్ గవర్నర్ గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. గవర్నర్ పదవులు చేపట్టక ముందు ఆయన రాజ్య సభ సభ్యునిగా పనిచేశారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎంపీగా కొనసాగారు. గణేషన్ 1945 ఫిబ్రవరి 16న బ్రాహ్మణ కుటు–ంబంలో ఇలక్కుమిరకవన్, అలమేలు దంపతులకు జన్మించారు. చిన్నతనంలో తండ్రి మరణించడంతో అతని అన్న దగ్గర ఉండి చదువుకున్నారు. ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ లో జాయిన్ అయ్యి ప్రచారక్ గా పనిచేశారు. తమిళనాడులో బీజేపీ పార్టీ బలోపేతానికి నిర్విరామంగా కృషి చేసిన గణేషన్ మృతి తీరని లోటని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.

# టీడీపీ పుట్టిన తర్వాత? ఫస్ట్ టైమ్

కడప, ఆగస్టు 15, పులివెందులలో వైసీపీకి డిపాజిట్ గల్లంతు.. అసలు వినడానికి ఏమాత్రం నమ్మశక్యంగా లేని ఈ పరిణామం నిజంగానే జరిగింది. పులివెందులలో పసుపు జెండా ఎగిరింది. పూల అంగళ్లలో తెలుగుదేశం సంబరం చేసింది. జగన్ ప్రెస్‌మీట్ సాక్షిగా తెలుగుదేశం విజయం నిన్ననే ఖరారు అయిపోయినా.. ఇవాళ అధికారిక ఫలితాల్లో టీడీపీ జగన్ పార్టీని చిత్తు చిత్తు చేసింది. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ 6033 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. తెలుగుదేశం అభ్యర్థి బీటెక్ రవి భార్య, మారెడ్డి లతారెడ్డి 6716ఓట్లు పొందగా.. వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డి 683 ఓట్లు సాధించారు. 1978 నుంచి పులివెందుల నియోజకవర్గం వైఎస్ ఫ్యామిలీ అడ్డా. 78లో వైఎస్ రాజశేఖరరెడ్డి.. రెడ్డి కాంగ్రెస్ తరపున గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకూ 12 సార్లు పులివెందులకు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే అన్నిసార్లూ వైఎస్ కుటుంబ సభ్యులే గెలిచారు. వైఎస్, ఆయన భార్య విజయమ్మ, ఆయన సోదరుడు వివేకానందరెడ్డి, ఆయన కుమారుడు , మాజీ సీఎం జగన్ మోహనరెడ్డి గెలిచారు. 2019లో అక్కడ జగన్ మెజార్టీ 90వేల మార్క్‌ను కూడా దాటింది. దీనిని బట్టే ఆ కుటుంబానికి పులివెందులలో ఉన్న పట్టు అర్థం చేసుకోవచ్చు. 1983లో తెలుగుదేశం పుట్టిన దగ్గర నుంచి అక్కడ జెడ్పీ ఎన్నికల్లో టీడీపీ గెలవలేదు. 30ఏళ్లుగా పులివెందుల మండలంలో అసలు ఎన్నికలే జరగలేదు. వైసీపీ ఏకగ్రీవంగా గెలుస్తోంది. అలాంటి చోట వైసీపీని తెలుగుదేశం మట్టికరిపించింది. అసలు ఇవి ఎన్నికలే కాదు.. జరిగింది రిగ్గింగ్? అని వైఎస్సార్సీపీ ముందే రిజల్ట్ తేల్చేసింది. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉండటం కొత్త విషయమేం కాదు. మంత్రాంగంలో మందుంటారు. యంత్రాంగం వాళ్ల కంట్రోల్‌లో ఉంటుంది. ఇప్పుడూ అదే జరిగింది. ఏదైనా రిజల్ట్ అనేదే ఫైనల్ కాబట్టి ఈ ఎన్నికలో వైఎస్సార్సీపీని తెలుగుదేశం చావుదెబ్బ కొట్టినట్టే.. ఫస్ట్ టైమ్ జగన్ ఇలాకాలో ఆయన పార్టీని దెబ్బతీయడం నిజంగా టీడీపీకి పొలిటికల్‌గా పెద్ద మైలేజ్. పులివెందుల ఎన్నికలను టీడీపీ చాలా సీరియస్‌గా తీసుకుంది. మరో ఏడాదిలో జెడ్పీ పదవీకాలం పూర్తవుతుంది. మామూలుగా పదవి పూర్తైతేనే స్థానిక ఎన్నికలు చంద్రబాబు అంత తొందరగా నిర్వహించరు అనే పేరుంది. అలాంటిది తప్పకుండా గెలిచి తీరతామన్న నమ్మకంతోనే? ఈ సారి వీళ్లు రంగంలోకి దిగారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి భార్య లతారెడ్డినే అభ్యర్థిగా రంగంలోకి దించారు. జమ్మలమడగు నుంచి ఆదినారాయణ రెడ్డి మొత్తం ఎన్నిక బాధ్యతను తనపై ఉంచుకుని పనిచేశారు. మంత్రి సవిత కూడా నియోజకవర్గంలోనే ఉండి గెలుపుకోసం ప్రయత్నాలు చేశారు. జగన్‌పై అగ్రెసివ్‌గా వెళ్లడం ద్వారా బీటెక్ రవి పులివెందులలో కొద్ది కొద్దిగా ఆదరణ పెంచుకుంటున్నారు. 2017 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీటెక్ రవి.. వైఎస్ వివేకానందరెడ్డిపై గెలుపొందడం మొదటి మలుపు.. 2024లో రవి జగన్ మెజార్టీ తగ్గించడంలో సక్సెక్ అయ్యారు. 2024 ఎన్నికల్లో జగన్ మెహనరెడ్డి మెజార్టీ ఏకంగా 30వేలకు పైగా తగ్గింది. ఇప్పుడు తన భార్యను నించోబెట్టి ? తానే అభ్యర్థిగా మండలంలో తిరిగారు..వైనాట్ 175 పేరుతో కుప్పంను కూడా కొట్టేస్తామంటూ సాధారణ ఎన్నికలకు ముందు వైసీపీ చూపించిన అత్యుత్సాహం కూడా టీడీపీ శ్రేణులు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడానికి ఓ కారణం. అప్పట్లో కుప్పంలో నాలుగు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మునిసిపాలిటీలను కూడా గెలుచుకున్న ఊపులో వైసీపీ కుప్పం అసెంబ్లీ స్థానాన్ని కొడతామని చెప్పింది. దానికి పోటీగా చంద్రబాబు పులివెందుల వచ్చి వైనాట్ పులివెందుల అన్నారు. రెండు అసెంబ్లీల్లో రిజల్ట్ మారలేదు కానీ.. కుప్పం స్థానిక ఎన్నికల్లో జరిగిన పరాభవానికి టీడీపీ ప్రతీకారం తీర్చుకుంది. అది కూడా డిపాజిట్ రానంత రేంజ్‌లో వైసీపీని ఓడించింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తానే ఎమ్మెల్సీగా గెలిచిన బీటెక్ రవి.. ఇప్పుడు మరోసారి తన భార్యను గెలిపించుకున్నారు.

# ఏం చేయాలి...

## పాపం... రేణుకా.. కలిసి రాని కాలం

కర్నూలు, ఆగస్టు 15, ఆర్థికంగా బలమైన ఫ్యామిలీ. సామాజికవర్గం పరంగా కూడా జిల్లాలో పట్టున్న కుటుంబం. అయినా సరే ఒకే ఒక చిన్న తప్పు రాజకీయ జీవితాన్ని ఇబ్బందుల పాలు చేసింది. ఆమె బుట్టా రేణుక. 2014 ఎన్నికలకు ముందు బుట్టా రేణుక ఎవరో తెలియదు. ఆ ప్రాంతంలో కొందరికే పరిచయం. అయితే వైసీపీ అధినేత వైఎస్ జగన్ 2014లో కర్నూలు ఎంపీ టిక్కెట్ ఇచ్చారు. దీంతో ఆమె తొలిసారి పార్లమెంటు గడప తొక్కారు. అయితే ఆ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాకపోవడంతో మనసు టీడీపీ వైపునకు మళ్లింది. దీంతో బుట్టా రేణుక వైసీపీ ఎంపీ పదవికి రాజీనామా చేయకుండానే టీడీపీ మద్దతుదారుగా కొనసాగారు. దీంతో పార్టీ ఆమెను 2019 ఎన్నికల్లో పక్కన పెట్టింది. కానీ తాను పార్టీ మారిన టీడీపీ 2019 ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదు. అదే సమయంలో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో బుట్టా రేణుక మరోసారి మనసు మార్చుకున్నారు. తిరిగి వైసీపీలో చేరారు. అయితే ఈసారి ఎమ్మిగనూరు అసెంబ్లీ టిక్కెట్ ను ఆశించారు. అనుకున్నట్లుగానే బుట్టారేణుకకు 2024 ఎన్నికల్లో ఎమ్మిగనూరు టిక్కెట్ లభించింది. కానీ ఈసారి జనం ఆదరించలేదు. గత ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులందరూ ఓడిపోవడంతో ఆమె కూడా ఓటమి పాలయ్యారు. మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బుట్టా రేణుక రెడీ అవుతున్నారు. ఈసారి ఎన్నికల్లోనూ ఎమ్మిగనూరు నుంచి పోటీ చేయాలని భావించి అక్కడే ఎక్కువగా తిరుగుతూ ప్రజల్లో ఉంటూ మమేకమై వారి సమస్యలను అడ్రెస్ చేస్తున్నారు.. బుట్టా రేణుక కుర్మి సామాజికవర్గానికి చెందిన . ఆమె మొత్తం 300 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలయి జనం ఆదరణను పొందలేకపోయారు. కానీ కూటమి ప్రభుత్వంపై ప్రస్తుతం అసంతృప్తి ఎక్కువగా ఉందని భావించి బుట్టారేణుక తిరిగి నియోజకవర్గంలోనే కాదు పార్టీలోనూ యాక్టివ్ గా మారారు. ఈసారి కూడా ఎమ్మిగనూరు నియోజకవర్గం టిక్కెట్ తనకే ఇవ్వాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. మరొకవైపు ప్రస్తుతం ఎమ్మిగనూరు టీడీపీలో అసంతృప్తులు ఎక్కువ కావడంతో పాటు ఎమ్మెల్యేకు, ప్రధాన నేతలకు మధ్య గ్యాప్ పెరగడంతో వారిని ఆకట్టుకునేందుక ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద నాలుగేళ్ల ముందే బుట్టా రేణుక ఎన్నికలకు సిద్ధమయి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారన్న టాక్ ఎమ్మిగనూరులో వినపడుతుంది.. ఎమ్మిగనూరులో తరచూ సమావేశాలు నిర్వహించడం పాటు కార్యకర్తలతో భేటీ అయి వారి వ్యక్తిగత సమస్యలను తీర్చడంలోనూ బుట్టా రేణుక ముందున్నారని చెబుతున్నారు. అక్కడే తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడంతో పాటు అక్కడ సిబ్బందిని నియమించి కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆమె కృషి చేస్తున్నారని అంటున్నారు. ఇక సోషల్ మీడియాలో కూడా బుట్టా రేణుక ముందున్నారని అంటున్నారు. పార్టీ మారిన బుట్టా రేణుక పదేళ్ల పాటు చట్ట సభలకు దూరమయి తిరిగి పుంజుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# నిన్న ఎమ్మార్వో... ఇవాళ ఎస్ ఐ

## నీ అందం మత్తెక్కిస్తోంది... న్యూడ్ కాల్ మాట్లాడు

## బరి తెగిస్తున్న అధికారం

అనంతపురం, ఆగస్టు 15, ”నీ అందం నన్ను కవ్విస్తోంది. నీ వయసు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏం చేస్తే నువ్వు నా సొంత మవ్వుతావు.. రోజు నీతో వీడియో కాల్ మాట్లాడుతున్న కదా.. నువ్వు కూడా నాతో నగ్నంగా మాట్లాడొచ్చు కదా.. నేను చూస్తుండగా నువ్వు బట్టలు విప్పేయచ్చు కదా.. ప్లీజ్ నన్ను సుఖపెట” ఇదీ ఓ కేసు నిమిత్తం పోలీస్ స్టేషన్ కు వచ్చిన మహిళతో ఓ ఎస్సై మాట్లాడిన మాటలు. అతడి పేరు రాజశేఖర్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లా ముదిగిబ్బ మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ తన భర్త నుంచి విడాకులు తీసుకుంది. ఈ కేసులో భరణం ఇప్పించాలని ఆమె తరపున గిరిజన మహిళ పోలీస్ స్టేషన్ కు వెళ్ళింది. ఆ గిరిజన మహిళ చూసేందుకు అందంగా ఉండడంతో.. దీనిని అదునుగా తీసుకున్న రాజశేఖర్ ఆమెను ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టాడు. తన కోరిక తీర్చాలని.. అప్పుడే న్యాయం చేస్తానని .. ఆలా చేయకపోతే తన నుంచి ఇబ్బందులు తప్పవని ఆమెను వేధింపులకు గురిచేసాడు. ఆమె నంబరు తీసుకుని రాత్రిపూట పదేపదే కాల్స్ చేసి ఇబ్బంది పెట్టేవాడు. అతడు నగ్నంగా మారి.. ఆమెను కూడా అలానే మారిపోవాలని ఒత్తిడికి గురి చేసేవాడు. తన భార్యను వదిలిపెట్టాలని ఆ గిరిజన మహిళ భర్త వేడుకున్నప్పటికీ ఎస్సై వినిపించుకునేవాడు కాదు. ఓసారి ఆమె అనంతపురం వెళ్ళింది. ఆమెను ఎస్ఐ వెంబడించాడు. తన వాహనంలో ఎక్కాలని ఒత్తిడికి గురిచేసాడు. రాజశేఖర్ వేధింపులు అంతకంతకు పెరిగిపోవడంతో ఆ మహిళ తనకు వీడియో కాల్ చేసినప్పుడు.. దానిని రికార్డ్ చేసింది. ఆ వీడియోలో ఎస్ఐ రాజశేఖర్ టవల్ తో ఉన్నాడు. ఆ మహిళతో అత్యంత అసభ్యకరంగా మాట్లాడాడు. అంతేకాదు తన ప్రైవేట్ పార్ట్స్ బయటికి తీసి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ వీడియో బయటికి రావడంతో ఎస్ఐ బాగోతం బయటకు వచ్చింది. ఈ విషయం ఉన్నతాధికారులు దృష్టికి వచ్చింది. దీంతో అతని వేకెన్సీ రిజర్వ్ కు బదిలీ చేస్తూ ఎస్పీ నిర్ణయం తీసుకున్నారు. అతని వ్యవహారంపై విచారణ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

# పాశర్లపూడిలో మళ్లీ గ్యాస్ ఉత్పత్తి .

కాకినాడ, ఆగస్టు 15,ఓఎన్జీసీ అంటే భారీ యంత్రాలు, భారీ వాహనాలు, ఎత్తైన రిగ్‌లు.. భూమి నుంచి ఆయిల్ , గ్యాస్ తవ్వి తీస్తాయట.. అనేంతవరకు తెలుసు. కానీ కోనసీమ ప్రాంతంలో జరిగిన ఓ ఘటనతో నేటికి అక్కడి ప్రజలను భయకంపితులను చేస్తుంది. అంతవరకు అసలు పాశర్లపూడి అనే ఊరు ఎక్కడ ఉందో తెలియని వారికి సైతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కనీవినీ ఎరుగని భయాన్ని కోనసీమ ప్రాంత ప్రజలు ప్రత్యక్షంగా చవి చూశారు. ఓఎన్జీసీ పేరు చెబితేనే నేటికీ వణికిపోతారు. 80 దశకంలో పుట్టిన వారిని, పెద్దలను ఎవ్వరినైనా అడిగితే ఇట్టే కళ్లల్లో భయం కనిపిస్తుంది. నాడు పాశర్లపూడిలో జరిగిన దుర్ఘటన గురించి చెబుతారు. ఓఎన్జీసీ చాలా ఆపరేషన్లు నిర్వహించినప్పటికీ పాశర్లపూడి బ్లో అవుట్ మాత్రం ఓఎన్జీసీ చరిత్రలో అతిపెద్ద రెండో ప్రమాదంగా చెబుతారు.. అటువంటి సంచలనానికి కేంద్రంగా మారిన అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పాశర్లపూడిలో ఇప్పుడు మళ్లీ ఓఎన్జీసీ కార్యకలాపాలు విస్తృతంగా నిర్వహిస్తుండగా గ్యాస్ నిక్షేపాల వెలికితీతలో సక్సెస్ అయినట్లు తెలుస్తోంది..కృష్ణా గోదావరి బేసిన్ పరిధిలో ఆన్‌షోర్ కార్యకలాపాలను ఓఎన్జీసీ మళ్లీ విస్తృతంగా నిర్వహిస్తోంది. గతంలో చేపట్టిన సిస్మిక్ సర్వేలో లభించిన సోర్స్ ఆధారంగా ఇందులో కొత్త ప్రాంతాల్లో చమురు, సహజవాయు నిక్షేపాల వెలికితీత కోసం రిగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పాశర్లపూడి ఓఎన్జీసీ క్షేత్రం శ్రీరామపేట సమీపంలో డ్రిల్లింగ్ నిర్వహిస్తున్న బావిలో ఆశాజనకంగా సహజ వాయువుతో కూడిన చమురు నిక్షేపాలు లభ్యమయ్యాయి. దీంతో ఉత్పత్తి పరీక్షలకు పాసర్లపూడి సెక్టార్‌లో ఓఎన్జిసి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.. గత నెల 9న డ్రిల్లింగ్ 2,860 మీటర్లకు చేరుకున్న చివరి సమయంలో ఒక్కసారిగా గ్యాస్ పైకి రావడంతో అప్రమత్తమైన సాంకేతిక సిబ్బంది గ్యాస్‌ను అదుపు చేశారు. గ్యాస్ లీకేజీ అవ్వడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురై నిరసనలు వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఆర్డీవో మాదవి, రెవెన్యూ అధికారులు సంబంధిత ఓఎన్జీసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు..1995 జనవరి 8న సాయంత్రం సుమారు 6:50 గంటల సమయం.. అంతా ప్రశాంతంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్ధంతో ఆకాశాన్ని తాకేలా అగ్ని జ్వాలలు సుమారు 100 మీటర్లు మేరకు పైకి ఎగదన్నాయి. చుట్టుపక్కల కొబ్బరి చెట్లన్నీ మాడి మసైపోయాయి. అక్కడున్నవారు ఏమయ్యారో తెలియదు. అసలు ఏం జరుగుతుందో, ఏం జరిగిందో తెలియదు. 50 కిలో మీటర్లు దూరం వరకు ఆకాశం ఎర్రగా మారింది. కాసేపటికి అధికారులు ద్వారా అసలు విషయం వెల్లడైంది. ఓఎన్జీసీ గ్యాస్ నిక్షేపాల వెలికితీత ప్రయత్నంలో ఉండగా ఒక్కసారిగా బ్లోఅవుట్ అయ్యిందని. బోడసకుర్రు గ్రామ పరిధిలో ఉండే ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (రాఔఉఅ)కు చెందిన ఈ పాశర్లపూడి గ్యాస్ వెల్ నంబర్ 19లో ఈ ప్రమాదం సంభవించిందని తెలిసింది. పాసర్లపూడి బ్లో అవుట్ అనేది భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఒక ప్రధాన పారిశ్రామిక ప్రమాదంగా చెబుతుంటారు. నాటి తూర్పు గోదావరి జిల్లాలోని అమలాపురం సమీపంలోని పాసర్లపూడి గ్రామంలో చోటుచేసుకోగా సుమారు 62-65 రోజుల పాటు అగ్నకీలలు ఎగసిపడ్డాయి. బ్లో అవుట్ సంభవించిన తర్వాత మిగిలిన పైపులు గ్యాస్ బయటికి పంపేశాయి. డ్రిల్లింగ్ టవర్లు అగ్నిజ్వాలలకు మైనంలా కరిగిపోయాయి. చుట్టుపక్కల సామగ్రి నాశనమైంది. బ్లో అవుట్ వల్ల రోజుకు 1 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ బయటికి వెలువడింది. మంటలు 10 కి.మీ.దూరం నుంచి కనిపించాయి. భారీ శబ్దం రెండు కిలోమీటర్ల దూరం వరకు వినిపించింది. ఉష్ణోగ్రత 50ళీఅకు మించి పెరిగింది. సమీప గ్రామాల నుంచి సుమారు 6000 కుటుంబాలను ఖాళీ చేయించి రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేశారు. చివరకు 65 రోజుల అనంతరం విదేశీ నిపుణుల సహకారంతో మంటలను అదుపు చేసి గ్యాస్ ను కంట్రోల్ చేసి క్యాప్ ఏర్పాటు చేయగలిగారు. అలాంటి ప్రాంతంలో ఇప్పుడు మళ్లీ గ్యాస్ తీసే ప్రయత్నాలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

# బుడమేరుకు భారీ వరద ప్రవాహం



విజయవాడ, ఆగస్టు 15, ఏపీకి భారీ వర్ష సూచన ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రచారం ప్రారంభం అయ్యింది. విజయవాడలోని బుడమేరుకు భారీ వరద ప్రవాహం వచ్చిందంటూ ప్రచారం నడుస్తోంది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత ఏడాది విజయవాడలో వరదలు సంభవించిన సంగతి తెలిసిందే. బుడమేరుకు గండిపడి విజయవాడ జలదిగ్బంధంలో చిక్కుకుంది. ప్రాణ నష్టం తో పాటు ఆస్తి నష్టం జరిగింది. సీఎం చంద్రబాబు వారం రోజులపాటు వరద సహాయక చర్యల్లో ఉండిపోవాల్సి వచ్చింది. అందుకే ఇప్పుడు బుడమేరుకు మరోసారి వరద ప్రవాహం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అయితే అది పుకారు మాత్రమేనని.. బుడమేరుకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదని జిల్లా అధికారులు ప్రకటించారు.గత ఏడాది సెప్టెంబర్ లో విజయవాడలో వరద ముంచెత్తిన విషయం ఇంకా కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది. బుడమేరు వాగుకు గండ్లు పడి వరద పోటెత్తగా.. దానికి కృష్ణ వరద కూడా తోడు కావడంతో విజయవాడ జలదిగ్బంధంలో చిక్కుకుంది. వారం రోజుల తర్వాత అక్కడ పరిస్థితి యథాస్థితికి వచ్చింది. అయితే నాడు ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. రోజుల తరబడి ఇళ్లకు పరిమితం అయ్యారు. ఆహారానికి కూడా అవస్థలు పడ్డారు. మంచినీరు కూడా దొరకకుండా పోయింది. రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే నాటి పరిస్థితిని గుర్తుచేసుకొని తాజాగా జరుగుతున్న ప్రచారంతో ఆందోళనకు గురయ్యారు విజయవాడ ప్రజలు.అయితే తాజాగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. అటు తెలంగాణలో సైతం భారీ వర్షాలు నమోదు అవుతున్నాయి.

# ఇప్పుడు నియోజకవర్గం...

కడప, ఆగస్టు 15, పులివెందులలో టీడీపీ జెండా ఎగిరింది. ..రాజశేఖర రెడ్డి హయాం నుంచి వైఎస్ ఫ్యామిలీకి కంచుకోటగా ఉన్న పులివెందులలో టీడీపీ గెలవడం మాత్రమే కాదు.. వైసీపీకి డిపాజిట్లు కూడా రాకపోవడం నిజంగా ఆశ్చర్య పరిచే విషయమే. అధికార పార్టీ ఈ ఎన్నికను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు. పులివెందులలో జెండా పాతడం కోసమే కాదు.. జగన్ పార్టీ మూలాలు పెకిలించాలనే బలమైన కసితో టీడీపీ శ్రేణులు పని చేశాయని వచ్చిన ఫలితాలను బట్టి భావించాల్సి ఉంటుంది.నిజంగానే పులివెందుల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ స్థాయిలో టీడీపీకి ఓటేసి ఉంటే గనుక రాష్ట్ర రాజకీయాల్లో ఇది కీలక మలుపు అని చెప్పొచ్చు. జగన్ సొంత జిల్లాలో టీడీపీ ఘన విజయం సాధించడంతో.. ఇక వైఎస్సార్సీపీ పని అయిపోయిందని, పార్టీని కాంగ్రెస్ విలీనం చేస్తారేమోనని తెలుగుదేశం శ్రేణులు ఎద్దేవా చేస్తున్నాయి. జగన్ కంచుకోటకు బీటలు.. అంటూ ప్రచారం మొదలైంది. మరి నిజంగానే ఈ విజయం టీడీపీకి, కూటమికి గొప్ప బూస్ట్‌ను ఇస్తుందా..? వైసీపీ పని ఇక అయిపోయినట్టేనా? అనేది చూద్దాం.అలాంటప్పుడు తన పార్టీ పనితీరును, తన మాట తీరును, ఎన్నికల వ్యూహాలను జగన్ ఓసారి సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే జగన్ అక్రమాస్తుల కేసుల్లో బెయిల్ మీద ఉండగా.. కొత్త కేసులు కూడా ఆయన కోసం ఎదురు చూస్తున్నాయి. వివేకా హత్య కేసు కూడా వైసీపీని వెంటాడుతోంది. రానున్న రోజుల్లో జగన్‌ను అధికార పార్టీ మరింతగా ఉక్కిరిబిక్కిరి చేసే అవకాశాలు ఉన్నాయి.పులివెందుల జెడ్పీటీసీ విజయం పట్ల తెలుగుదేశం పార్టీ స్పందిస్తూ.. ‘30 ఏళ్ల తరువాత, పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది. ప్రజలు స్వేచ్ఛగా ఓటేసి, ప్రజాస్వామ్యాన్ని గెలిపించారు’ అని పేర్కొంది. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి విజయాన్ని.. కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన బహుమతిగా ఆ పార్టీ చెబుతోంది.పులివెందుల, ఒంటిమిట్టల్లో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. పులివెందులలో బీటెక్ రవి సతీమణి లతా రెడ్డి.. వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డిపై 6033 ఓట్ల భారీ తేడాతో విజయం సాధించారు. పులివెందులలో లతా రెడ్డికి 6716 ఓట్లు పడగా.. వైసీపీ అభ్యర్థి డిపాజిట్లు కోల్పోయారు. వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగిన ఈ ఎన్నికలో టీడీపీ భారీ మెజార్టీతో గెలవడంతో తెలుగుదేశం శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నాయి. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని టీడీపీ చెబుతుండగా.. రిగ్గింగ్ చేసి గెలిచారని వైఎస్సార్సీపీ ఆరోపిస్తోంది.పులివెందులతో పోలిస్తే ఒంటిమిట్టలో వైఎస్సార్సీపీ కాస్త గట్టిపోటీనే ఇచ్చిందని చెప్పొచ్చు. ఇక్కడ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి 6270 ఓట్లు రాగా.. వైఎస్సారసీపీ తరఫున పోటీ చేసిన ఇరగం సుబ్బారెడ్డి 3165 ఓట్లు సాధించారు. దీంతో 3105 ఓట్లతేడాతోటీడీపీ అభ్యర్థి గెలుపొందారు. .సాధారణంగా ఇలాంటి ఎన్నికల్లో ప్రజలు అధికారంలో ఉన్న పార్టీ వైపే మొగ్గు చూపుతారు. టీడీపీ దాదాపు మరో నాలుగేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉండనుంది. దీంతో ఆ పార్టీని గెలిపిస్తే.. తమ ప్రాంతానికి మేలు జరుగుతుందని జనం భావిస్తారు. అందుకే అధికారంలో ఉన్న పార్టీవైపే మొగ్గు చూపుతారు. 2017లో జరిగిన నంద్యాల అసెంబ్లీ ఉపఎన్నికలను పరిశీలిస్తే.. జనం అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతారని స్పష్టమవుతోంది.కానీ పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందని, జనాలను ఓట్లు వేయనీయకుండా మధ్యలోనే బెదిరించి వెళ్లగొట్టి.. అధికార పార్టీ వాళ్లే దొంగ ఓట్లు వేశారని వైసీపీ ఆరోపిస్తోంది. పులివెందులలో తమ వాళ్లెవరూ ఓటేయలేదని.. తమ పార్టీకి పడిన ఆ 683 ఓట్లనూ టీడీపీ వాళ్లే వేశారని మాజీ మంత్రి పేర్ని నాని ఎద్దేవా చేశారు. 2021లో జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో 25 వార్డులకు గానూ తమ పార్టీ 19 వార్డులు గెలుపొందగా.. టీడీపీ 6 వార్డులు గెలిచిందని నాని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో తాము ఇలాగే చేసి ఉంటే.. అసలు టీడీపీ ఒక వార్డు కూడా గెలిచి ఉండేది కాదన్నారు.చంద్రబాబు బందిపోట్లను మించిపోయారు.. వైఎస్ జగన్ సంచలన కామెంట్స్‘2019 ఎన్నికలకు ఏడాదిన్నర ముందు 2017 నంద్యాల ఉపఎన్నికలోనూ టీడీపీ ఇలాగే మైక్రో మేనేజ్‌మెంట్ చేసి, 27 వేల ఓట్ల తేడాతో గెలిచింది. నన్ను, వైఎస్సార్సీపీని తిట్టించారు. తెలుగుదేశం పార్టీ బ్రహ్మాండంగా ఉందని చెప్పారు. కానీ ఏడాదిన్నర తర్వాత అదే నంద్యాలలో వైఎస్సార్సీపీ 35 వేల ఓట్ల తేడాతో గెలిచింది. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ భూస్థాపితమైంది’ అని పులివెందుల ఎన్నికల ఫలితాల వెల్లడికి ఒక రోజు ముందు జగన్ మాట్లాడారు. తద్వారా పులివెందులలో ఓడినా.. తట్టుకొని నిలబడటమే కాదు.. తిరిగి టీడీపీని బలంగా దెబ్బకొడతామనే ధీమాను జగన్ వ్యక్తం చేశారు.



## 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో అభివృద్ధిని ప్రతిబింబిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేసిన వివిధ శాఖల వివరాలు..





విభారే. కర్నూలు ప్రతినిధి1. సమాచార పౌర సంబంధాల శాఖ2. వైద్య మరియు ఆరోగ్య శాఖ 3. జిల్లా గ్రామీణ అభివృధి సంస్థ (డిఆర్డిఎ)4. జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ5. పౌర సరఫరాల శాఖ6. ఉపాధి హామీ 7. అప్కో - చేనేత8. పశుసంవర్ధక శాఖ9. సాంఘిక సంక్షేమ శాఖ10. విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరియు. వృయోవృద్దుల శాఖ11. జిల్లా వెనుకబడిన తరగతుల సేవ సహకార సంఘం (ఃఅ కార్పొరేషన్)12. మైనారిటీ సంక్షేమ శాఖ13. రెడ్ క్రాస్ సొసైటీ14. ఉద్యాన శాఖ15. అంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు (ఏపిఎంఐపి)వేడుకల చివర్లో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రివర్యులు టి.జి.భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా,ఎస్పి విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య తదితరులు స్టాల్స్ సందర్శించారు..

## జిల్లా సమగ్రాభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

### జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



విభారేకర్నూలుప్రతినిధి, ఆగస్టు 15:జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియ చేస్తూ జిల్లా సమగ్రాభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు.శుక్రవారం79 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో, క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భరతమాత స్వేచ్ఛ కోసం ఎందరో మహానుభావులు త్యాగాలు చేశారని, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, జిల్లా అభివృద్ధికి పునరంకితం అవుదామని కలెక్టర్ పిలుపునిచ్చారు..రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం తో పాటు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా అనేక చర్యలు చేపట్టడం జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు..జిల్లా సమగ్రాభివృద్ధి చెందేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు..ఈ కార్యక్రమాల్లో డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఏ పిడి రమణారెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుమల,ఆగస్ట్15: వారంతపు సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వైకుంఠ క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు పూర్తిగా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతుంది. వైకుంఠ క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోవడంతో భక్తులను ఆక్టోపస్ భవనం నుంచి తితిదే క్యూ లైన్లలోకి అనుమతిస్తోంది. స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తితిదే సిబ్బంది అన్నప్రసాదాలు, నీరు, పాలు అందిస్తున్నారు.

## "స్త్రీ శక్తి" పథకం ప్రారంభించిన మంత్రి బీసీ

- - -విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 15- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంను జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాతో కలిసి శుక్రవారం రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. నంద్యాల పట్టణంలోని బస్టాండ్ నుండి బనగానపల్లె కు వెళ్ళే బస్ సర్వీస్ లో జిల్లా కలెక్టర్, సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి.. మహిళా సోదరీమణులతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి ప్రయాణించారు. ఈ బస్సు ప్రయాణంలో ఆయా మహిళల ఆర్థిక పరిస్థితులు, సాధకబాధకాలు, స్త్రీశక్తి పథకం మహిళలకు ఎంతమేరకు ఉపయోగరమనే విషయాలు ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ పాలన, సంక్షేమ ? అభివృద్ధి కార్యక్రమాలపై బస్సులో మహిళా ప్రయాణీకుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అంటూ తమ అభిప్రాయాలను మంత్రితో పంచుకున్న మహిళా సోదరీమణులు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ఇచ్చిన హామీ మేరకు స్త్రీ శక్తి పథకంను అమలు చేస్తున్నామని, మహిళలంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన



తర్వాత ఇప్పటికే ఫింఛన్ రూ. 3 నుంచి 4 వేలకు పెంచడం, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు విజయవంతంగా అమలు చేశాం.. తాజాగా నేడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం సంతోషకరంగా ఉందన్నారు. తొలుత ఉచిత బస్సు ప్రయాణం జిల్లా వరకే పరిమితం చేయాలని ఆలోచించినప్పటికీ, మహిళలకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చాలనే ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించాం అన్నారు. ఈ పథకంలో భాగంగా (పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్) 5 రకాల బస్సుల్లో.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడీ కార్డుతో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 15-శుక్రవారం ఉదయం నంద్యాల జిల్లా కేంద్రం పి.ఎస్.సి అండీ కె.వి.ఎస్.సి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ లో అత్యంత వేడుకగా... కన్నుల పండువగా 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను. నిర్వహించారు. ఈ వేడుకలలో రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖామాత్యులు మరియు జిల్లామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరైనారు. జాతీయ పతాకావిష్కరణ గావించి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు.ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ సుదర్శన్ రెడ్డి, పట్టణానికి చెందిన ప్రముఖులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా జిల్లా కలెక్టరు రాజకుమారి గణియా, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలతో కలిసి పెరేడ్ మైదానాన్ని రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖామాత్యులు మరియు జిల్లామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి పరిశీలించారు.అనంతరం వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి.ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై మంత్రివర్యులు బి.సి.జనార్ధన్ రెడ్డి ప్రజలకు సందేశమిచ్చారు.అనంతరం వివిధప్రభుత్వ శాఖల్లో ఉత్తమప్రతిభ కనబరిచినఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, అవార్డులను. మంత్రివర్యులుబహూకరించారు. అలాగేసాంస్కృతిక కార్యక్రమాలనుప్రదర్శించిన విద్యార్థులబృందాలకు ప్రశంసా పత్రం,బహుమతులు అందించారుఉత్తమ ప్రగతి శఖటాల ప్రదర్శనలో.... ఉద్యానవన 12 మరియు సూక్ష్మ నీటి సాగు శాఖకు ప్రధమ, నంద్యాల పురపాలక సంఘం వారికి ద్వితీయ, నంద్యాల జిల్లా పోలీసు శాఖ శక్తి టీం వారికి తృతీయ బహుమతి ప్రధానం చేశారు.అనంతరం జాతీయ గీతాలాపనతో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమాలు ముగిశాయి.



## కొత్తూరు లో డోన్ ఆర్యవైశ్య భక్తులు

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 15-ప్రముఖ శైవక్షేత్రం నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో శ్రావణ మాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల వీరయ్య శర్మ, నారాయణ శర్మ, కంపమల్ల సురేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గందం అభిషేక పూజలు, రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.



గ్రామ ప్రజలతో పాటు చాలా మంది సుదూర ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు మరియు డోన్ నుంచి ఆర్యవైశ్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. డోన్ ఆర్యవైశ్య భక్తులు ప్రత్యేకించి గత కొన్ని సంవత్సరాలుగా శ్రావణ మాసంలో మూడవ శుక్రవారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో, ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడాలని, పాడిపంటలతో రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్టు వారు తెలిపారు.

## జాతీయ పతాకాన్ని ఎగురవేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 15-దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. గురువారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కలెక్టరేట్ లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రామునాయక్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ....స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని వారి త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమన్నారు. మనమందరం వారిని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు ముందుకు వెళ్లాలన్నారు.అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి జిల్లాను అభివృద్ధి పదంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు.



## ఎందరో త్యాగల ఫలితమే మనం అనుభవిస్తున్నాం

### -అభిరుచి మదు జిల్లా బిజెపి అధ్యక్షులు

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 15-ఎందరో త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్నామని నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మదు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో. 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ, భారత ప్రధానమంత్రి మాన్య శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో 11 సంవత్సరాల కాలంలో భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద 3 వ ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు ఎంతో దూరంలో లేదన్నారు. నంద్యాల జిల్లా ప్రజలకు, భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కశెట్టి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు, ఉపేంద్ర రెడ్డి, నిమ్మకాయల సుధాకర్, జిల్లా కోశాధికారి, సాయి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చింతా నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు, డాక్టర్ ఇంటి ఆదినారాయణ బాలముని , మూడవ పట్టణ అధ్యక్షుడు లక్ష్మీ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



## కళారాధన లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

### --జాతీయ పతాకం ఆవిష్కరణ చేసిన డాక్టర్ రవి కృష్ణ-

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 15-నంద్యాల కళారాధన,జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, క్రీడా సమాఖ్య కార్యాలయం వద్ద ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ 79వ దేశ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పతాక వందనం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో అంకితభావంతో పనిచేసి దేశఅభివృద్ధిలో పాలుపంచుకోవలసిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.వీ.వి. రమణయ్య,కార్యదర్శి రామలింగం, ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి ,వెంకటరావు, సంయుక్త కార్యదర్శి చలపతి, కార్యవర్గ సభ్యులు రంగస్వామి, వీర భరతుడు,దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు షాహీనూర్, జిల్లా చెస్ సంఘం కార్యదర్శి సుబ్బారెడ్డి, కళారాధన కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి,రామయ్య, వాసు ,కార్యాలయ కార్యదర్శి మధు, వెంకటేశ్వర్లు, సూర్య తదితరులు పాల్గొన్నారు .



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**